హంద్రీ-నీవా ద్వారా చెరువులకు నీరు

- ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి
- ట్రాక్టర్ ర్యాలీకి ఘన స్వాగతం పలికిన ప్రజలు, రైతులు





నల్లచెరువు: పాలపాటి దిన్నె నుంచి ట్రాక్టర్ల ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, గాండ్లపెంట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి

గాండ్లపెంట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశీస్సులతో గాండ్లపెంట, నల్లచెరువు మండలాల్లోని చెరువులను హంద్రీ-నీవా నీటితో నింపుతామని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. ఆదివారం జగనన్నకు ధన్యవాదాలు తెలిపేందుకు నల్లచెరువు మండలంలోని పాలపాటిదిన్నె ఆంజనేయ స్వామి గుడి నుంచి ప్రారంభమైన ట్రాక్టర్ ర్యాలీకి సామచేనుబైలు వద్ద ప్రజలు, రైతులు మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. మలమీదపల్లిలో స్థానిక నాయకులు ప్రతాపరెడ్డి, చలపతి తదితరులు గజమాలతో ఎమ్మెల్యేను సన్మానించారు. అనంతరం వంకపల్లి, తూపల్లి గ్రామాల మీదుగా ర్యాలీ గాండ్లపెంటలోని వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్దకు చేరుకుంది. తొలుత స్థానిక నాయకులతో కలిసి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే సిద్దారెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దశాబ్దాలుగా సాగునీరు లేక రైతులు భూములను బీడుగా వదిలేశారన్నారు. వైఎస్ జగన్ ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల్లోనే మండలానికి హంద్రీనీవా జలాలతో ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేశారని గుర్తు చేశారు. రెండు మూడు నెలల్లో పనులు ప్రారంభించి ఎత్తిపోతల పథకం ద్వారా నల్లచెరువు మండలంలోని ఎగువ ప్రాంతాల్లోని చెరువులతో పాటు గాండ్లపెంట మండలంలోని అన్ని చెరువులకు కృష్ణా జలాలను అందించి సస్యశ్యామలం చేస్తామని పేర్కొన్నారు. వచ్చే ఏడాది నాటికి పనులు పూర్తి చేసి నీటిని నింపే కార్యక్రమం చేపడతామన్నారు.

చంద్రబాబుకు సమస్యలు పట్టవు..

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 10 రోజుల క్రితం కదిరికి వచ్చినప్పుడు అధికారంలోకి వస్తే గాండ్లపెంట మండలానికి నీరిస్తామని చెప్పారన్నారు. గతంలో 5 సంవత్సరాల కాలంలో ఏ ఒక్క రోజు కూడా నీరు ఇవ్వాలన్న ఆలోచన చంద్రబాబుకు రాలేదని మండిపడ్డారు. తప్పుడు హామీలు ఇవ్వడం ఆయనకు అలవాటే అన్నారు. సీఎం జగన్ సారథ్యంలో నియోజకవర్గంలోని 6 మండలాలకు నీరిచ్చే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను మాజీ ఎంపీటీసీ హైదర్‌వలీ, ముస్లింలు టోపీ, దుశ్శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నల్లచెరువు, కదిరి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గాండ్లపెంట మండల నాయకులు ఎంపీపీ తాతం జగన్మోహన్, వైస్ ఎంపీపీ భారతి ప్రతాపరెడ్డి, జెడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు ఫయాజ్‌అలీ, కన్వీనర్ పోరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ భాస్కరరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గజ్జల రవీంద్రారెడ్డి, బీసీ కన్వీనర్ జక్కల నరసింహగౌడ్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు రవీంద్రనాయక్, మలమీదపల్లి, గాండ్లపెంట, మద్దివారిగొంది సర్పంచులు కళావతి, రహంతుల్లా, నాగభూషణం రెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం జగన్

నల్లచెరువు: రైతు పక్షపాతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. గాండ్లపెంట మండలానికి హంద్రీ–నీవా కాలువ నుంచి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించేందుకు ప్రభుత్వం రూ.46 కోట్లు మంజూరు చేసింది. పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి ఆలయం నుంచి మల్లమీద పల్లి మీదుగా గాండ్లపెంట మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వరకూ భారీగా ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. తొలుత పాలపాటి దిన్నె ఆంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్ నిధులు మంజూరు చేశారన్నారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2009 సంవత్సరం నాటికి హంద్రీనీవా పనులను 80 శాతం పూర్తి చేసి ఉమ్మడి అనంతపురం జిల్లాకు నీరందించి వలసలను నివారించారన్నారు. గడచిన నాలుగు సంవత్సరాల్లో రెండు మండలాలకు పూర్తి స్థాయిలో నీరందించామని తెలిపారు. తలుపుల, ఎన్‌పీకుంట మండలాలకు కూడా నీరందించే కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమణారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి, సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు జయచంద్రారెడ్డి, టెంపుల్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రవికుమార్ రెడ్డి, నాయకులు నిరంజన్ రెడ్డి, డాక్టర్ శంకర్, ఉత్తన్న, రమణారెడ్డి, పోలం మాధవరెడ్డి, సానే హరినాథ్ రెడ్డి, సోమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు పీహెచ్‌సీ ప్రారంభోత్సవం



నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనం

ఎన్‌పీకుంట: మండల కేంద్రంలో నాడు–నేడు పథకం కింద సుమారు రూ.2.27 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు ఎంపీపీ ఈటె రాము ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ కన్వీనర్లు, నాయకులు, అధికారులు కార్యక్రమంలో పాల్గొనాలని సూచించారు.

కానిస్టేబుల్‌కు ఆపన్నహస్తం



హెడ్ కానిస్టేబుల్ ఓబులేష్ కుమారుడికి ఆర్థికసాయం అందజేస్తున్న పోలీసులు

బత్తలపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఓబులేష్‌కు స్టేషన్ సిబ్బంది, మిత్రులు అండగా నిలిచారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన వైద్య ఖర్చులకు బత్తలపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది, మిత్రులు కొంత నగదును తమ జీతాల నుంచి చెల్లించారు. ధర్మవరం రూరల్ సీఐ ఆరోహణ రావు ఆధ్వర్యంలో ఆదివారం రూ.77,100 మొత్తాన్ని హెడ్ కానిస్టేబుల్ కుమారుడికి అందజేశారు. ఓబులేష్ త్వరగా కోలుకుని తిరిగి విధుల్లో చేరాలని ఆకాంక్షించారు. ఆర్థికసాయం అందించిన పోలీసులకు ఓబులేష్ కుమారుడు కృతజ్ఞతలు తెలిపారు.

పత్మాసు ప్రార్థన మందిరం పాస్టర్‌గా మిషాయోలు



కదిరి అర్బన్: పట్టణంలోని అమీన్‌నగర్‌లో ఉన్న పత్మాసు ప్రార్థన మందిరం పాస్టర్‌గా టీ. మిషాయోలు ఆదివారం నియమితులయ్యారు. చర్చి అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో చర్చి కమిటీ సభ్యులు నాగేంద్ర ప్రసాద్, మనోహర్, రెడ్డెయ్య పాల్గొన్నారు.

పల్లకీలో ఊరేగిన శ్రీకృష్ణుడు



శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకీలో ఊరేగిస్తున్న భక్తులు

కొత్తచెరువు: మండల కేంద్రంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకృష్ణుడి విగ్రహాన్ని పల్లకీలో ఊరేగించారు. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఐదు రోజుల పాటు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పల్లకీలో శ్రీకృష్ణుడి ఉత్సవ విగ్రహాన్ని డప్పులు మేళాలతో ఊరేగించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అలివేలమ్మ, రెడ్డప్ప, సాయినాథ్, కల్పన, రెడ్డమ్మ, నాగభూషణ, నాగేంద్ర, రాము, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



జిక్రియా మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి: బుక్కపట్నంలోని మైనార్టీ కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త జిక్రియా (54)అనారోగ్యంతో బాధపడుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ సుధాకర్‌రెడ్డి తదితరులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జిక్రియా మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం రూ.9,500 ఆర్థికసాయం అందజేశారు. ప్రభుత్వం పరిహారం త్వరగా అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల మైనార్టీ కన్వీనర్ ఖదీర్, మండల బూత్ లెవల్ కమిటీ మేనేజర్ పతంజలి, సచివాలయ కన్వీనర్ అమీర్, నీలూరి ఈశ్వర్ పాల్గొన్నారు.

మాజీ ఆర్మీ ఉద్యోగుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం అర్బన్: దేశానికి విశేష సేవలందించడంలో ఆర్మీ జవాన్ల కృషి వెలకట్టలేనిదని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురంలో ఆదివారం మాజీ ఆర్మీ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశం కోసం ప్రాణాలను త్యాగం చేస్తున్న ఆర్మీ జవాన్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మేడాపురం వెంకటేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్‌బాషా, బాలిరెడ్డి, ధర్మవరం మాజీ ఆర్మీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామిరెడ్డి, ఆర్గనైజర్ మహేష్, కార్యదర్శి శివశంకర్, కోశాధికారి నాగభూషణం, ఉపాధ్యక్షులు పవన్‌కుమార్, శ్రీనివాసరెడ్డి, గౌరవాధ్యక్షుడు పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అక్రమాలకు పాల్పడితే శిక్ష తప్పదు'

అమడగూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో న్యాయమే గెలిచిందని నల్లమాడ మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కుళ్లాయినాయక్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అవినీతి, అక్రమాలకు పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్ష అనుభవించక తప్పదన్నారు. చంద్రబాబు ప్రభుత్వ సొమ్మును అక్రమంగా కంపెనీలకు తరలించారనే పక్కా ఆధారాలతో సీఐడీ అధికారులు అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. ఇకనైనా టీడీపీ నేతలు తమ తప్పును తెలుసుకోవాలని సూచించారు. రాష్ట్రాభివృద్ధికి తోడ్పడితే మంచిదన్నారు. ధర్నాలు, నిరసనల పేరుతో రోడ్లపైకి ఎక్కితే వారు తీసుకున్న గోతిలో వారే పడతారని ఎద్దేవా చేశారు.

పేలని పచ్చ టపాసులు

- టీడీపీ నేతల రిలేదీక్షలకు స్పందన నిల్
- కూలి ఇస్తామన్నా రాని జనం

కదిరి: ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణానికి కర్త, కర్మ, క్రియ అంతా మాజీ సీఎం చంద్రబాబు నాయుడే అని రుజువైంది. ఈ కేసులో ఆయనకు న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ మేరకు న్యాయస్థానం ఆదివారం తీర్పు వెలువరించింది. తీర్పు చంద్రబాబుకు అనుకూలంగా వస్తుందని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో ఆశతో ఎదురు చూశారు. కదిరి నియోజకవర్గంలో ఆ పార్టీ నాయకులు స్థానిక వేమారెడ్డి కూడలిలో ఉన్న ఎన్‌టీఆర్ విగ్రహం వద్దకు తీర్పు వెలువడేందుకు 2 గంటల ముందే చేరుకుని నానా హంగామా చేశారు. పెద్ద ఎత్తున టపాసులు పేల్చి చంద్రబాబు నిర్దోషి అని గట్టిగా నినాదాలు చేస్తూ పట్టణంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో సంబరాలు చేసుకోవాలని అంతా సిద్ధం చేసుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి విజయోత్సవ ర్యాలీకి సన్నాహాలు చేసుకున్నారు. కోర్టు తీర్పు చంద్రబాబుకు వ్యతిరేకంగా వెలువడటంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు మెల్లిగా అక్కడి నుంచి జారుకున్నారు.

రిలేదీక్షలకు మద్దతు కరువు

చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ టీడీపీ ఇచ్చిన పిలుపు మేరకు కదిరిలో ఆ పార్టీ నేతలు తలపెట్టిన రిలే దీక్షలకు ప్రజల నుంచి మద్దతు పూర్తిగా కొరవడింది. ఒక్కో మహిళకు రోజుకు రూ.500 నగదు ఇస్తామని టీడీపీ నాయకులు బ్రతిమాలినప్పటికీ ఒక్క మహిళ కూడా రాకపోవడం గమనార్హం. దీన్ని బట్టే ఆ పార్టీ, చంద్రబాబు నాయుడుపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత స్పష్టమైందని జనం అంటున్నారు. జనం నుంచి టీడీపీకి సానుభూతి రాకపోవడంతో కదిరిలో ప్రజల దృష్టిని ఆకర్షించాలని ఆ పార్టీకి చెందిన ఓ కార్యకర్త సెల్ టవర్ ఎక్కి కాసేపు హంగామా చేశాడు. పోలీసులు అక్కడికి చేరుకుని అతడ్ని అక్కడి నుంచి పంపేశారు.

అక్కడ ఆయన.. ఇక్కడ ఈయన

టీడీపీ కదిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కందికుంట వెంకట ప్రసాద్ స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్‌లో దీక్షకు దిగితే.. అదే పార్టీకి చెందిన మరోనేత అత్తార్ చాంద్‌బాషా రూరల్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో దీక్షకు దిగారు. దీక్షకు మద్దతు తెల్పాలని వారిద్దరూ కొందరు నాయకులతో పాటు ప్రజా సంఘాల నాయకులను కోరినప్పటికీ ఎవ్వరూ ముందుకు రాలేదు. తప్పు చేసిన వారికి శిక్ష వేస్తే తప్పేంటనే సమాధానం టీడీపీ నాయకులకు జనం నుంచి ఎదురైంది. చంద్రబాబుకు రిమాండ్ విధించినట్లు అన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకున్న జనం 'న్యాయమే గెలిచింది' అన్నారు.

టీడీపీ నాయకుల దౌర్జన్యం

నల్లచెరువు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో చంద్రబాబుకు 14 రోజుల రిమాండ్ విధించడంతో టీడీపీ నాయకులు రెచ్చిపోయారు. ఆదివారం రాత్రి స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద జాతీయ రహదారిపై వాహనాల డ్రైవర్లపై దౌర్జన్యం చేశారు. ఎస్ఐ వరలక్ష్మి సంఘటన స్థలాన్ని చేరుకుని, టీడీపీ నాయకులను అదుపులోకి తీసుకున్నారు.

'ఉపాధి' పనులపై నేడు గ్రామసభలు

అమడగూరు: గత ఏడాది కాలంగా మండల వ్యాప్తంగా నిర్వహించిన ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నందున అన్ని గ్రామ పంచాయతీల్లో సోమవారం నుంచి గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ అమరావతి పేర్కొన్నారు. 11వ తేదీన మహమ్మదాబాద్, తుమ్మల, కొట్టువారిపల్లి, జౌకలకొత్తపల్లి, 12న చినగానిపల్లి, అమడగూరు, 13న పూలకుంటపల్లి, 14న చీకిరేవులపల్లి, గుండువారిపల్లి, కస్సముద్రం గ్రామ పంచాయతీల్లోని సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఉపాధి పనులను చేసిన వారంతా హాజరై ఆడిట్ సిబ్బందికి సహకరించాలన్నారు.

శుభకార్యం

కొత్తచెరువు: మండల కేంద్రంలో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు. మండల పరిధిలోని మరకుంటపల్లికి చెందిన రవీంద్రారెడ్డి కుమార్తె రాగిణి, నరేష్‌కుమార్ రెడ్డి వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. అలాగే కమ్మవారిపల్లి గ్రామానికి చెందిన ఆదికేశవ కుమారుడు సతీష్‌కుమార్, భవ్య వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి నగర పంచాయతీ పరిధిలోని బీడుపల్లి వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో మాజీ కౌన్సిలర్ పద్మజా రాణి, నాగిరెడ్డి దంపతుల కుమారుడు విష్ణుసాగర్‌రెడ్డి, ప్రవల్లికా రెడ్డి వివాహం జరిగింది. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, ఆయన సతీమణి అపర్ణరెడ్డితో కలిసి వధూవరులను ఆశీర్వదించారు. అలాగే ఆర్‌వీజే కళ్యాణ మండపంలో జరిగిన చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లికి చెందిన వెంకటనారాయణ రెడ్డి కుమార్తె శ్రీలత, మణికంఠరెడ్డి వివాహానికి హాజరయ్యారు. ఎనుములపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నాగేంద్ర కుమార్తె సునీత, నాగేంద్రల వివాహానికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

గుండెపోటుతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



మృతుడు మౌలాసాబ్

అమడగూరు: మండలంలోని లోకోజుపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బోనాల మౌలాసాబ్ (65) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. మృతుడు మౌలాసాబ్ ఆర్టీసీ కండక్టర్‌గా పని చేసి, 5 సంవత్సరాల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నాయకులు గ్రామానికి చేరుకుని మృతుడి కుమారులు అమితాబ్, రెడ్డిసాబ్‌ను పరామర్శించారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివారెడ్డి, వన్నూర్ సాబ్, బావాజీ, కుళ్లాయప్ప, దస్తగిరి, ముస్తఫా, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా దుస్తుల వితరణ



పిల్లలకు క్రీడా దుస్తులు అందజేసిన దృశ్యం

ధర్మవరం అర్బన్: నార్పలలోని అనాథ పిల్లల ఆశ్రమానికి పట్టణానికి చెందిన డాక్టర్ సూర్యనారాయణ రెడ్డి, పట్టణ ప్రముఖుడు బండి రాములు ఆదివారం 26 జతల క్రీడా దుస్తులను అందజేశారు. అనంతరం పిల్లలకు స్వీట్లు, అరటిపండ్లు అందజేసి, మానవత్వం చాటుకున్నారు.

పోతలయ్య స్వామికి ప్రత్యేక పూజలు

కనగానపల్లి: మండలంలోని దాదులూరు గ్రామంలో వెలసిన పోతలయ్యస్వామికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. చుట్టు గ్రామాల నుంచి గాక జిల్లాల నలుమూలల నుంచి వచ్చిన భక్తులు ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి బోనాలు సమర్పించారు.

మానసిక ఒత్తిడిని జయించాలి

రాప్తాడురూరల్: మానసిక ఒత్తిడిని జయిస్తే ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన ఉండదని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తెలిపారు. ఆదివారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఉమెన్ డాక్టర్స్ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని ప్రభుత్వ కళాశాల ఎస్సీ బాలికల వసతి గృహంలో జరుపుకున్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన శ్రీదేవి, ఆంధ్ర ప్రదేశ్ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ చైర్‌పర్సన్ రామలక్ష్మి మాట్లాడారు. ఏదో సాధించాలనే తపన, ఏమీ సాధించ లేదన్న నిరాశ, ఇంకేమీ సాధించలేమన్న నిస్సహాయ స్థితిలోనే చాలామంది నిండు జీవితాలను బలితీసుకుంటున్నారన్నారు. నేటి యువత చిన్న కారణాలకే తనువు చాలించి అయినవారికి ఆవేదన మిగులుస్తున్నారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జి.హేమలత, జన విజ్ఞాన వేదిక సభ్యురాలు డాక్టర్ ప్రసన్న, అనంతపూర్ ఐఎంఏ ఉమెన్ డాక్టర్స్ వింగ్ సెక్రటరీ డాక్టర్ సుమన గోపీచంద్, సైకాలజిస్ట్ అర్యన్ స్కూల్ ప్రిన్సిపాల్ లహరి పాల్గొన్నారు.

'రామ్‌రాజ్' షోరూమ్ ప్రారంభం



కంపెనీ ప్రతినిధులతో కలసి రామ్‌రాజ్ షోరూమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

ధర్మవరం: రామ్‌రాజ్ కాటన్ కంపెనీ తమ నూతన షోరూమ్‌ను ఆదివారం ధర్మవరంలో ప్రారంభించింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి షోరూం ప్రారంభించారు. రామ్‌రాజ్ కాటన్ కంపెనీ దుస్తులు ''గౌరవనీయుల హోదా'' అనే ముద్రతో అమ్ముడవుతున్నాయని షోరూం ప్రతినిధులు తెలిపారు. దేశంలో అత్యంత విశ్వసనీయ, అత్యంత ఆకర్షణీయ బ్రాండ్ జాబితాలో రామ్‌రాజ్ స్థానం పొందిందని పేర్కొన్నారు. సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడుకోవాలనే తపనతో దక్షిణ భారతదేశంలోని అన్ని ముఖ్య కేంద్రాలలో షోరూమ్‌లను ప్రారంభించినట్లు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భారతీయుల కోసం ఆన్‌లైన్‌లో విక్రయాలు కూడా ప్రారంభించామన్నారు.

పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం



దాతలను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: పేద ప్రజలకు సేవ చేయడంలో రోటరీక్లబ్ ముందంజలో ఉంటుందని రిటైర్డ్ కంటి వైద్యాధికారి డాక్టర్ నరసింహులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు శంకర్ కంటి ఆసుపత్రి వైద్యులు కంటి చూపు తగ్గిన వారికి వైద్య పరీక్షలు చేశారు. డాక్టర్ నరసింహులు, రోటరీక్లబ్ కార్యదర్శి నాగభూషణం, కోశాధికారి సుదర్శన్‌గుప్తా మాట్లాడుతూ.. ఇప్పటి వరకూ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో 32 వేల మందికి కంటి ఆపరేషన్లు ఉచితంగా చేయించామన్నారు. వైద్య శిబిరంలో 108 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా 75 మంది ఆపరేషన్లకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు సత్రసాల ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేషులు, రమేష్‌బాబు, నరేంద్రరెడ్డి, శివయ్య, నాగరాజు, పెరుమాళ్లదాసు, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నేడు 'స్పందన'

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరి దేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. అదే విధంగా మండల స్థాయిలో జరిగే స్పందన కార్యక్రమానికి మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని సూచించారు. ప్రజలు కూడా ఏవైనా సమస్యలుంటే వినతిపత్రాలను అందజేయవచ్చని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ జాతర



గంగమ్మ దేవతకు బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని గొట్లూరు గ్రామంలో ఆదివారం రామ జేజయ్య రజక సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ జాతరను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. అనంతరం అమ్మవారికి జంతు బలులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు గాండ్లపర్తి లింగమయ్య, గంగాధర్, చెన్నప్ప, రాముడు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యం. శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ఆదివారం పట్టణంలో శ్రీ శంబాల పిరమిడ్ దివ్యశక్తి ధ్యాన మందిరం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్య అతిథులుగా పెనుగొండ, అనంతపురం, పీటీఎం ప్రాంతాలకు చెందిన సత్యంశివం సుందరం, రాజేష్, నీరజ, వెంటరమణారెడ్డి, సూర్యనారాయణ స్వామీజీలు హాజరయ్యారు. డ్రెస్‌కోడ్, ఫ్లకార్డ్స్, డీజే సంగీతంతో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో దివ్యధ్యాన మందిరం నిర్వాహకులు జై చంద్రారెడ్డి, బాబాఖలందర్, సుబాషిణి పాల్గొన్నారు.